పర్యావరణ పరిరక్షణకు మొక్కలు

● సమీక్ష సమావేశంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్

సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

మణికొండ, జూలై 15: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటడంతో పాటు అవి ఎదిగేలా బాధ్యత తీసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వజ్రోత్సవ వనమహోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 16 నుంచి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వనమహోత్సవం ప్రారంభిస్తున్నామన్నారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీతోపాటు ఎవెన్యూ ప్లాంటేషన్, మిడియన్ ప్లాంటేషన్ అన్ని వార్డుల్లో చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ, ఏఈ, టీపీఎస్, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి..

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయని వాటిని నివారిచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ వెల్లడించారు. సోమవారం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువ శాతం ఉంటుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అనారోగ్యాలకు గురికాకుండా సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధికారులు వ్యర్థాలు పేరుకుపోకుండా చూడాలన్నారు. ప్రతివార్డులో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ ఫాగింగ్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కమిషనర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించాలని వినతి

డీజీపీకి వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 15: రాష్ట్రంలోని గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలని కోరుతూ ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌నాయక్ కోరారు. సోమవారం లక్డీకాపూల్‌లోని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌కు అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.మోహన్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.దీప్‌లాల్‌చౌహాన్‌తో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో గిరిజన, బంజారాలపై దాడులు పెరుగుతున్నాయని, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం, మూలచింతలపల్లికి చెందిన ఈశ్వరమ్మపై కొందరు పాశవికంగా దాడి చేశారని, ఈనెల 11న నర్సంపేట డివిజన్ చింతలతండాకు చెందిన ఓ ప్రేమోన్మాది దంపతులను హత్య చేశారన్నారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో రాంచందర్‌నాయక్ కోరారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

వీడీసీసీ రోడ్ల ప్రతిపాదనలను జెడ్సీకి అందజేస్తున్న కార్పొరేటర్

జూబ్లీహిల్స్, జూలై 15: అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు. డివిజన్‌లో సుమారు రూ.1 కోటి వ్యయంతో వీడీసీసీ, సీసీరోడ్ల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి ప్రతిపాదనలను అందజేశారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత అందించాలని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 60 స్కూల్ బ్యాగ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ప్రతి ఏటా అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తారన్నారు. వాటిని శ్రద్ధగా విని, నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి వావసవి వెల్ఫేర్ అసోసియేషన్ తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అనీష్, మహేశ్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

బండ్లగూడ జాగీర్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 15: అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. అనంతరం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె టీచర్లు విద్యార్థులతో కలిసి అమ్మమాట అంగన్‌వాడీ బాటపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మేయర్ వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో మరుగు దొడ్ల నిర్మాణనికి చర్యలు తీసుకోవడంతో పాటు ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు నాగలక్ష్మి, సరస్వతి, శాలిని, వనజ, విజయ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ బాటపై అవగాహన కల్పిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

టీచర్ కుటుంబానికి లక్ష చెక్కు అందజేత

జూబ్లీహిల్స్, జూలై 15: పీఆర్టీయూ టీఎస్ సభ్యురాలైన యూసుఫ్‌గూడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రాధ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డితో కలిసి పీఆర్టీయూ రాష్ట్ర శాఖ తరఫున రూ.1లక్ష చెక్కును సోమవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ఖైరతాబాద్, నాంపల్లి మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, వేణుమాధవ్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసన్, అశోక్, సురేశ్, తబితా జాసన్, గీత, మంజుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు రాధ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

సీసీరోడ్డు పనుల ప్రారంభం

సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు తదితరులు

మణికొండ, జూలై 15: సమస్యాత్మక రోడ్లకు శాశ్వత పరిష్కారం కోసం నూతన సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని నార్సింగి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు తెలిపారు. 25 లక్షలతో నిర్మిస్తున్న నూతన సీసీ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. గోతులమయమైన రోడ్ల ప్రాంతంలో నూతన సీసీరోడ్లు వేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు డి.శాంసన్, డి.సుధాకర్, డి.జయశంకర్, డి.శ్రీనివాస్, డి.జయకుమార్, జి.శ్రీను, డి.సుమన్, డి.భానుచందర్, జయమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్ తమిళ నాడు

జూబ్లీహిల్స్, జూలై 15: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన తైక్వాండో 1 వ వీఐఎస్‌డబ్ల్యూ ఓపెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమిళనాడు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. సౌత్ ఈస్ట్ సంయుక్త కార్యదర్శి దండు సురేశ్‌బాబు ఆధ్వర్యంలో జాతీయ తైక్వాండో పోటీల ఎంపిక కోసం నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుంది. పోటీల్లో విజేతలకు మేజర్ జనరల్ ఈశ్వరన్, డాక్టర్ బీకే మిశ్రా, వెటరన్స్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్, వెటరన్స్ ఇండియా స్పోర్ట్స్ వింగ్ గ్రాండ్ మాస్టర్ ఎం.జయంత్‌రెడ్డి, అమికోల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ వీణ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

బోనాల చెక్కులు పంపిణీ

జూబ్లీహిల్స్, జూలై 15: బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బోనాల పండుగ చెక్కులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక గాయకులను ప్రోత్సహించాలి

హిమాయత్‌నగర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న గాయకులకు ధ్రువీకరణ పత్రాల అందజేత

హిమాయత్‌నగర్, జూలై 15: ఔత్సాహిక గాయకుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలని తెలంగాణ టీవీ చాంబర్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రఖ్యాత గాయకులు హేమంత్, సాయి అన్నారు. శాతవాహన ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఔత్సాహిక గాయనీ, గాయకులకు సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మేనేజ్‌మెంట్ ఎండీ సుధీర్ మాట్లాడుతూ ఔత్సాహిక గాయకులను తయారు చేయడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విఠల్‌కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

పనులను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు

పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.వెంకటేశ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 15: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు.

శంషాబాద్ రూరల్, జూలై 15: తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని స్థానిక మాజీ సర్పంచ్ కొమ్మగంటి అంజయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు కోరారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలి

ఖైరతాబాద్, జూలై 15: వడ్డెరల కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడ్డెరల సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వడ్డెరలకు ఎకరం భూమి, కోటి కేటాయించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు ఎకరాలు పెంచుతూ రూ.5కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శివరాత్రి వెంకటేశ్, రమేశ్, గండయ్య తదితరులు పాల్గొన్నారు.

పీర్లకు దట్టీలు సమర్పించిన ఎమ్మెల్సీలు


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న శ్రీనగర్‌కాలనీ ఎంఐఎం నేత జాఫర్

వెంగళరావునగర్, జూలై 15: మొహర్రం సందర్భంగా ఎల్లారెడ్డిగూడ చావిడిలోని పీర్లకు ఎంఐఎం ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్, మిర్జా రహ్మత్ బేగ్ దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆషూర్ ఖానా నిర్వాహకులు ఆయన్ని సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనగర్‌కాలనీ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు, ఆషూర్ ఖానా నిర్వాహకుడు ఎస్‌కే జాఫర్, ఎంఐఎం నాయకులు అజ్జర్, షేక్ నిజాం, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి ఉత్సవాలు

జూబ్లీహిల్స్, జూలై 15: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, ఫౌండర్ ట్రస్టీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. సోమవారంతో వేడుకలు ముగిశాయి.

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

ఖైరతాబాద్, జూలై 15: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌కే భవన్ వద్దకు చేరుకోగానే పోలీసులు విద్యార్థులను అరెస్టు చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ కలిపి రూ.8వేల కోట్ల బకాయి ఉందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నేతలు ఇటిక్యాల రామకృష్ణ, నరేశ్, రఘురాం, నాగజ్యోతి, ప్రవీణ్, రాజు, చైతన్య, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

హిమాయత్‌నగర్, జూలై 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ విమర్శించారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. సీపీఐ నేతు ఛాయ దేవి, యాదగిరి, స్టాలిన్ పాల్గొన్నారు.

అక్రమ కేసు ఉపసంహరించుకోవాలి

ఖైరతాబాద్, జూలై 15: బీఎల్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ మూడో టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వ్యభిచారం కేసు పేరుతో అరెస్టు చేశారన్నారు. తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

హిమాయత్‌నగర్, జూలై 15: దోమల వల్ల వచ్చే వ్యాధులపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 ఏఎంహెచ్‌వో హేమలత తెలిపారు. దోమల నివారణపై సోమవారం నారాయణగూడలోని పలు స్కూల్స్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటిలో పెరిగే దోమలను పిల్ల దశలో ఉన్నప్పుడే నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం ఏఈ అంబిక, ఎస్ఎస్ తిరుపతినాయక్, ఎస్‌ఎఫ్ఏలు సోమయ్య, కె.శ్రీనివాస్, మధు, ఎం.శ్రీనివాస్, సతీశ్‌చంద్ర, కామేశ్, అర్జున్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణ

ఖైరతాబాద్, జూలై 15: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై రాజకీయ దురుద్దేశంతోనే కొందరు అత్యాపు ఆరోపణలు చేస్తున్నారని న్యాయవాది ప్రతాప్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాప్రాలో భూకబ్జాలతో ఎమ్మెల్యేకు సంబంధం ఉందని కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అంతకుముందే ఆ భూమి వివాదంలో ఉందని, అలాంటి సందర్భంలో ఆయన ఎలా జోక్యం చేసుకుంటారని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సాయం చేసినట్లు నటించి సెల్‌ఫోన్ చోరీ

వెంగళరావునగర్, జూలై 15: సాయం చేసినట్లు నటించి సెల్‌ఫోన్ తీసుకొని పరారైన ఘటనపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సనత్‌నగర్ సుభాష్‌నగర్‌కు చెందిన బి.నవీన్ (27) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం రాత్రి 11:45 గంటలకు డ్యూటీ ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు వద్దకు వచ్చేసరికి తన బైక్‌కు చైన్ సమస్య వచ్చింది. ఇద్దరు వ్యక్తులు వచ్చి సాయం చేసినట్లు నటించి అతన్ని లిఫ్ట్ అడిగారు. జవహర్‌నగర్ వద్దకు వచ్చేసరికి ఫోన్‌కాల్ చేసుకుంటామని చెప్పి ఫోన్ తీసుకున్నారు. రోడ్డుపై మాట్లాడుతున్నట్లు నటిస్తూ అక్కడినుంచి పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో 8 మంది అరెస్ట్

జూబ్లీహిల్స్, జూలై 15: జిగ్లిజ్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ రవిచంద్రారెడ్డి కిడ్నాప్ కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి వివరాల ప్రకారం.. నెల 10న నందగిరిహిల్స్ హుడాకాలనీకి చెందిన రవిచంద్రారెడ్డిని కంపెనీ ఉద్యోగుల జీతాల విషయమై మాట్లాడేందుకు ఇంటి నుంచి తీసుకెళ్లి నిర్బంధించారు. దీంతో అతని తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అత్యంత వేగంగా దర్యాప్తు చేసి 8 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 84 ల్యాప్‌టాప్‌లు, 2 కార్లు, 5 సెల్‌ఫోన్లు, 3 పాస్‌పోర్ట్‌లతో పాటు నిందితుల రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని చీరాలకు చెందిన ఎ.జగదీష్ (34), నెల్లూరుకు చెందిన కొలగట్ల గౌతమ్ (26), నంద్యాలకు చెందిన శివశంకర్‌రెడ్డి (24), నాగోల్‌కు చెందిన సూదగాని సుజిత్ (24), రంగారెడ్డి జిల్లా బాచుపల్లికి చెందిన కమల్‌తేజ్ (27), ఎర్రగడ్డకు చెందిన షేక్ ఆజాద్ (24), చిక్కడపల్లికి చెందిన కర్నాటి ముఖేశ్ (33), ముషీరాబాద్‌కు చెందిన రాకేశ్ (24)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆ బిడ్డ.. నా కొడుకు కాదు

ఖైరతాబాద్, జూలై 15: తన భార్యకు కలిగిన మూడో సంతానం తన బిడ్డ కాదని ఏపీ దేవాదాయ శాఖ మాజీ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మదన్‌మోహన్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2013లో నంద్యాలకు చెందిన శాంతిని వివాహం చేసుకున్నానని, 2015లో తమకు కవల పిల్లలు జన్మించారన్నారు. 2020లో ఆమెకు దేవాదాయ శాఖలో ఉద్యోగం వచ్చాక, తాను పీహెచ్‌డీ చేసేందుకు అమెరికా వెళ్లానని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న తన భార్య ఓ సందర్భంలో విజయసాయిరెడ్డిని తనకు పరిచయం చేసిందన్నారు. విజయవాడలో విల్లా కొనుకుందామని, రూ.4కోట్లు ఖర్చువుతుందని తన భార్య చెప్పిందన్నారు. ఆ సమయంలో విజయసాయిరెడ్డి విల్లా కొనేందుకు కోటి, మరోసారి రూ.60లక్షలు, ఇంకోసారి కోటి సాయం చేశారని తెలిపారు. అయితే తాను అమెరికా వెళ్లినప్పుడు శాంతి గర్భం దాల్చిందని, దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవన్నారు. ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కన్నానని ఓ సారి, విజయసాయిరెడ్డి తనతో బిడ్డ కావాలని కోరాడని మరోసారి చెప్పుకొచ్చిందన్నారు. ఐవీఎఫ్ ద్వారా పుట్టాడని శాంతి చెబుతున్నదని, ఐవీఎఫ్ పత్రంలో సుభాష్ అనే సంతకం ఉందని ఆయన ఆరోపించారు. అయితే సుభాష్, విజయసాయిరెడ్డిలపై తనకు అనుమానం ఉందని, ఆ బిడ్డకు తండ్రి ఎవరనేది తేలే వరకు తాను పోరాటం చేస్తూనే ఉంటానని, డీఎన్ఏ పరీక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు.

మిడ్ డే మీల్స్‌పై నిర్ణయాన్ని మార్చుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 15: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.రామస్వామి, ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిర్ణయం అమలు జరిగితే 23 ఏండ్లుగా మధ్యాహ్న భోజన వంటలు చేస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి చందు, మధ్యాహ్న భోజన కార్మికులు వడ్ల మంజుల, సంతోష్, అండాలు, ఆర్.రాములమ్మ, వై.పద్మ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

బండ్లగూడ, జూలై 15: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి శ్రీదేవికాలనీలో వెలిసిన అక్రమ నిర్మాణాన్ని సోమవారం కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వేసేందుకు జీహెచ్‌ఎంసీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. వీరు టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేయవలసి ఉంటుంది. ఈ విభాగంలో డీసీ, ఇంజినీరింగ్ విభాగం నుంచి ఏఈ, డీఈ, నోడల్ అధికారి, న్యాక్ అధికారులు ఉంటారు.

రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో జూలైలో లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు నిర్వహించారు. విజేతలను సత్కరించారు. మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ

PUBLIC NOTICE

The members of general public are hereby informed that our clients are intending to purchase Plot bearing No. 244, admeasuring 1350 sq.yards in Survey No. 81, The Indira Gandhi Co-operative Housing Society Limited, situated at Gaganpahad Village, Rajendernagar Mandal, Ranga Reddy District, Hyderabad from its owner and possessor Sri Laxmi Nandan. If any member of general public has any right, title, claim or interest in respect of the said property, they are hereby called upon to furnish particulars of such claim along with copies of the documents etc., to the undersigned within a period of [7] days from the date of this publication failing which our clients shall proceed with the transaction and conclude the same and objections, if any, raised subsequently will not be entertained.

Sd/- M.NARSIMHA REDDY, Advocate
M/s Ganu and Co Advocates
201-202, 3.5.874/A, Vipanchi Estates,
Hyderguda, Hyderabad-500 029.